# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గిరిజన గ్రామాలను స్వయం సమృద్ధిగా మార్చడమే ఆది కర్మయోగి అభియాన్ ఉద్దేశ్యమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ శ్రీలంక ప్రధానమంత్రి డాక్టర్ హరిణి అమరసూర్య ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు.
- ❖ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నాసిక్ లోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL) నూతన ఉత్పత్తి కేంద్రంలో మొదటి తేజస్ LCA MK1A ఫైటర్ జెట్‌ను ప్రారంభించారు.
- ❖ దేశాభివృద్ధికి ఈశాన్య ప్రాంతం చోదకశక్తిగా మారిందని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు.

====================

ప్రతి గిరిజన గ్రామాన్ని స్వావలంబన, స్వయం సమృద్ధిగా మార్చడమే ఆది కర్మయోగి అభియాన్ ఉద్దేశ్యమని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఆది కర్మయోగి అభియాన్ జాతీయ సమావేశంలో రాష్ట్రపతి మాట్లాడుతూ... ఈ అభియాన్ ద్వారా జాతీయ అభివృద్ధి ప్రయాణంలో గిరిజన సమాజాలు పాల్గొనేలా చూడాలని కోరారు. అలాగే అభివృద్ధి ప్రయోజనం గిరిజన ప్రాంతాలకు చేరేలా చూడాలని సూచిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ.. దేశంలోని లక్ష గిరిజన గ్రామాల్లో 20 లక్షల మంది శిక్షణ పొందిన నాయకుల కేడర్‌ను నిర్మించడమే ఆది కర్మయోగి అభియాన్ లక్ష్యమని అన్నారు.

====================

శ్రీలంక ప్రధానమంత్రి డాక్టర్ హరిణి అమరసూర్య ఈరోజు న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. విద్య, సాంకేతికత, ఆవిష్కరణల అభివృద్ధి, సహకారం, మత్స్యకారుల సంక్షేమం వంటి వివిధ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసే దిశగా ఇరువురు నేతలు చర్చలు జరిపారు. ఉమ్మడి అభివృద్ధి లక్ష్యంగా ఇరు దేశాలు కలిసి పని చేయడానికి భారత్ సన్నద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. శ్రీలంక ప్రధానమంత్రి పర్యటన భారత్ శ్రీలంక దేశాల సంబంధాలకు ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు.

===================

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు నాసిక్ లోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL) నూతన ఉత్పత్తి కేంద్రంలో మొదటి తేజస్ LCA MK1A ఫైటర్ జెట్‌ను ప్రారంభించారు. అలాగే HTT-40 శిక్షణ విమానం రెండవ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన.. నాసిక్ డివిజన్‌లో తయారు చేయబడిన సుఖోయ్-30, LCA, HTT-40ల విమానయానం ప్రశంసనీయమని వ్యాఖ్యానించారు. ఇది రక్షణ రంగంలో దేశ స్వావలంబన విమానయానంగా అభివర్ణించారు. బెంగుళూరులో ఉన్న రెండు కేంద్రాల్లో సంవత్సరానికి 16 ఫైటర్ జెట్‌ల ఉత్పత్తి జరుగుతోందని, నాసిక్‌లో కొత్తగా ఏర్పాటైన మూడవ కేంద్రం సంవత్సరానికి మరో 8 ఫైటర్ జెట్లను ఉత్పత్తి చేస్తుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

===================

దేశాభివృద్ధికి ఈశాన్య ప్రాంతం చోదకశక్తిగా మారిందని కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. గత సంవత్సరం మంత్రిత్వ శాఖ సాధించిన విజయాలకు సంబంధించిన వివరాలను పాత్రికేయులకు న్యూఢిల్లీలో ఈరోజు ఆయన వెల్లడించారు. ఈశాన్య ప్రాంత సామర్థ్యాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు గత 11 సంవత్సరాలుగా ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. 9 విమానాశ్రయాలు మాత్రమే ఉన్న ఈశాన్య ప్రాంతంలో ఆ సంఖ్య ప్రస్తుతం 17కి చేరిందని, అలాగే అక్కడి జాతీయ రహదారులు 10 వేల కిలోమీటర్ల నుండి 16 వేల కిలోమీటర్లకు పెరిగాయని వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

===================

భారతీయ జనతా పార్టీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు బీహార్‌లోని సరన్‌లో పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తరైయాలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా ముఖ్యమంత్రి నితిశ్‌కుమార్ రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించారని ప్రశంసించారు. గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషి.. పేదలకు ఒక వరం అని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు.

===================

డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై స్పందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర దర్యాప్తు సంస్థ (CBI) లను కోరింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. హర్యానాలోని అంబాలాకు చెందిన 73 ఏళ్ల మహిళ నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు సుప్రీంకోర్టు ఈ చర్య తీసుకుంది. స్కామర్లు నకిలీ సుప్రీంకోర్టు ఆదేశాలను ఉపయోగించి డిజిటల్ అరెస్ట్ ద్వారా తనను బంధించి కోటి రూపాయలకు పైగా వసూలు చేశారని.. ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌కి పంపిన ఫిర్యాదులో ఆమె ఆరోపించింది. నకిలీ కోర్టు ఆదేశాలను ఉపయోగించడం న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసంపైనే దాడి చేస్తుందని, దీనిని తీవ్రంగా పరిగణించాలని కోర్టు పేర్కొంది.

====================

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఉజ్బెకిస్తాన్ భద్రతా మండలి కార్యదర్శి విక్టర్ మఖ్ముదోవ్‌తో బిషేక్ లో ఈరోజు సమావేశమయ్యారు. కిర్గిజ్ రిపబ్లిక్‌లోని భారత రాయబార కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో భద్రత, నిఘా, సహకార రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని ఇరు దేశాలు సమీక్షించాయని, అలాగే ఆఫ్ఘనిస్తాన్‌లో భద్రతా పరిస్థితిపై అభిప్రాయాలను పరస్పరం తెలియజేసుకున్నారని రాయబార కార్యాలయం తెలిపింది. రక్షణ, కనెక్టివిటీ సమస్యలలో సహకారాన్ని పెంచుకోవడంపై కూడా చర్చించారని పేర్కొంది. కజకిస్తాన్ భద్రతా మండలి కార్యదర్శి గిజాత్ దౌరెన్‌బెకోవిచ్ నూర్‌డౌలెటోవ్ తో కూడా అజిత్ దోవల్ సమావేశమయ్యి.. భద్రతా రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించారని భారత రాయబార కార్యాలయం తెలియజేసింది.

====================

గాయాలు, ప్రమాదాల సందర్భంలో జరిగే నష్టాన్ని తగ్గించడానికి ప్రభుత్వం నిబద్ధతో పని చేస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా పునరుద్ఘాటించారు. ఈరోజు ప్రపంచ ట్రామా దినోత్సవం సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం వేదికగా.. అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థల ఆవశ్యకతను, ప్రజల అవగాహన అవసరాన్ని ఈరోజు గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ప్రమాదాలు, గాయాలతో అనేక మంది మరణిస్తున్నారని, కాలిన గాయాలు, ఇతర గాయాల నివారణ, నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం పలు జాతీయ కార్యక్రమాలు చేపట్టి, దేశవ్యాప్తంగా ట్రామా కేర్ కేంద్రాలు, బర్న్స్ యూనిట్లకు అవసరమైన సహకారాన్ని అందిస్తోందని చెప్పారు. `ట్రామా కేర్‌తో సురక్షితమైన భవిష్యత్‌ను నిర్మించడం` అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం ప్రపంచ ట్రామా దినోత్సవం నిర్వహిస్తున్నామని కేంద్రమంత్రి తెలియజేశారు.

====================

గుజరాత్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈరోజు నూతన మంత్రివర్గాన్ని ప్రకటించింది. హర్ష్ సంఘ్వి ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ 21 మంది మంత్రుల చేత ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, బీజేపీ జాతీయ అధ్యక్షులు జె.పి.నడ్డా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మంత్రులలో ఒక ఉప ముఖ్యమంత్రి, ఐదుగురు క్యాబినెట్ హోదా మంత్రులు, స్వతంత్ర బాధ్యతలు కలిగిన ముగ్గురు సహాయ మంత్రులు, 12 మంది సహాయ మంత్రులు ఉన్నారు. కొత్త మంత్రివర్గంలో రివాబా జడేజాతో సహ ముగ్గురు మహిళా నేతలు ఉన్నారు.

====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 467 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 485 పాయింట్ల లాభంతో 83 వేల 952 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 124 పాయింట్ల లాభంతో 25,709 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 87 రూపాయల 82 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.46 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 338 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

====================
====================